ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
మంగళవారం | 03 ఫిబ్రవరి , 2026 | పేజీలు : 06

## అల్వాల్‌రెడ్డి మృతి బాధాకరం



ప్రజాపక్షం/చందంపేట: నల్గొండ జిల్లా చందంపేట మండలం మూడుదండ్ల గ్రామానికి చెందిన సిపిఐ పార్టీ నాయకులు పందిరి అల్వాల్‌రెడ్డి ఆదివారం అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరం అని సిపిఐ మండల కార్యదర్శి ఉప్పునూతల వెంకటయ్య అన్నారు. అల్వాల్ రెడ్డి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈసందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ మండలంలో సిపిఐ పార్టీ పెద్ద నాయకుడిని కొల్పోయిందని, గ్రామంలో సిపిఐ పార్టీ బలోపేతానికి అల్వాల్‌రెడ్డి ఎంతగానో కృషి చేశారని అన్నారు. నాటి నుండి నేటి వరకు సిపిఐ పార్టీలో ఉంటూ పార్టీ కార్యక్రమాలలో చూరుకుగా పాల్గొని పార్టీని బలోపేతం చేశారని అన్నారు. ఆయన వెంట సిపిఐ సహాయ కార్యదర్శి వెంగళయ్య, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, పందిరి రాజు, కేశ్యనాయక్ తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యే బాలునాయక్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికల పర్వం

ప్రజాపక్షం/దేవరకొండ; మున్సిపల్ ఎన్నికల సందర్భంగా సోమవారం దేవరకొండ పట్టణం లోని 1వ వార్డు బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి ఇలియాస్ తల్లి ఇశ్రాత్ జహా తో పాటు 30 మంది కార్యకర్తలు బిఆర్ఎస్ పార్టీని వీడి ఎంఎల్ఏ బాలు నాయక్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎంఎల్ఏ బాలునాయక్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ బాలునాయక్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో దేవరకొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతోందని, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలే ప్రజల విశ్వాసానికి నిదర్శనం అని అన్నారు. దేవరకొండ మున్సిపాలిటి అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నామని, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయం అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో నల్గొండ పార్లమెంట్ కో ఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్, మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, వెంకటేశ్వర్లు, వేణుధర్‌రెడ్డి, అరుణసురేష్‌గౌడ్, సైదులు, పాపానాయక్, ఇస్మాయిల్, సద్దాం, కలీం తదితరులు పాల్గొన్నారు.



## పక్కాగా ఎలక్షన్ కోడ్ అమలు

### యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంత రావు



ప్రజాపక్షం/ఆలేరు : ఎన్నికల సంఘం నిబంధనలు పాటిస్తూ నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, ఎన్నికల విధుల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంత రావు సూచించారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా నామినేషన్ కేంద్రాన్ని కలెక్టర్ సోమవారం సందర్శించారు. ఆలేరు మున్సిపల్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, నామినేషన్ ఫారంలు, రిజిస్టర్లను పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, అప్పీళ్ల పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటీ చేసే అభ్యర్థుల ప్రకటన తదితర ప్రక్రియలు పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 3వ తేదీన బరిలో నిలిచిన అభ్యర్థుల తుది జాబితాను ముద్రణ చేస్తామని వెల్లడించారు. 11వ తేదీన పోలింగ్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని, 13వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టి తుది ఫలితాలు ప్రకటిస్తామని తెలిపారు. ఆలేరుతో పాటు యాదగిరిగుట్ట, భువనగిరి, పోచంపల్లి, మోత్కూర్, చౌటుప్పల్ మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగనున్నాయని పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేపట్టామని, కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ ఆంజనేయులు, అబ్జర్వర్, శ్రీనివాస్, ఎఆర్వో వెంకటేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్వయం ఉపాధితో యువత ఎదగాలి



ప్రజాపక్షం/నకిరేకల్ : ఉద్యోగాలు అవకాశాలు సాధించలేమనిబాధపడకుండా స్వయం ఉపాధితో యువత ఆర్థికంగా అభివృద్ధి చెందాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కోరారు.సోమవారం నకిరేకల్ పట్టణంలోని న పన్నాలగూడెంలో ఏర్పాటు చేసిన ఎస్‌విజి ఫోటోగ్రఫీఎస్టూడియోను,సాయిబాబా ఆలయ సమీపంలో నూతనంగా నిర్మించిన భవాని లెమన్ టీ కేఫ్‌ను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూయువత ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని స్వయం ఉపాధి రంగాల్లోరాణించాలని పిలుపునిచ్చారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని నిర్వాహకులకు సూచిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.ఈకార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ గాజుల సుకన్య,పన్నాల రాఘవరెడ్డి,లింగాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ఎసిబి వలలో అవినీతి చేప

### రూ.20వేలు లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు దొరికిన ఆర్ఐ



ప్రజాపక్షం/ నల్లగొండ (గుర్రంపోడ్): నల్లగొండ జిల్లా గుర్రంపోడ్ మండలం లోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఎసిబి అధికారులు ఆకస్మిక దాడులు చేశారు.గుర్రంపోడ్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ మహమ్మద్ హకీమ్ లంచం తీసుకుంటూ ఉండగా రెడ్ హ్యాండ్‌గా దొరికిపోయారు.బాధితుడు నుంచి రూ.20వేలు లంచం తీసుకుంటూ ఎసిబి అధికారుల వలలో పట్టుబడ్డాడు. కార్యాలయాన్ని చుట్టుముట్టిన ఎసిబి అధికారులు సిబ్బందిని అదుపులోకి తీసుకుని లోతైన విచారణ చేపట్టారు. కీలకమైన పత్రాలు, ఫైల్ ను తనిఖీలు చేశారు. పెద్ద తిమింగలాలు తప్పించుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

## పేట మున్సిపాలిటీలో రెండు వార్డులు మినహా అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్

ప్రజాపక్షం/సూర్యాపేట : సూర్యాపేట మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేయనున్న అభ్యర్థుల పేర్లను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డిలు మొత్తం 48 వార్డుల్లో 6, 9 వార్డులు మినహా మిగతా వార్డుల్లో పోటీచేయనున్న అభ్యర్థుల పేర్లను సోమవారం వెల్లడించారు. వార్డుల వారీగా ఆ పార్టీ నుండి పోటీ చేయనున్న అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి... 1వ వార్డు నుండి బానోతు సైదులు, 2వ వార్డు తన్వీర్ హుస్సేన్ సయ్యద్, 3వ వార్డు పడిదల రవికుమార్, 4వ వార్డు మహ్మద్ రఫీయా బేగం, 5వ వార్డు ధరావత్ నీలాబాయ్, 7వ వార్డు పి శ్రీరాములు, 8వ వార్డు మొండికత్తి వసంత, 10వ వార్డు వెంకటి శేఖర్ రెడ్డి, 11వ వార్డు యడ్ల గంగాభవాని, 12వ వార్డు కోడి నాగరాజు, 13వ వార్డు భూక్య కౌసల్య, 14వ వార్డు పంతంగి దశరథ, 15వ వార్డు పిల్లల భవాని, 16వ వార్డు షేక్ జహీర్, 17వ వార్డు బైరబోయిన శ్రీదేవి, 18వ వార్డు పూర రామ్మూర్తి యాదవ్, 19వ వార్డు బొప్పాని శ్రీకాంత్, 20వ వార్డు చెంచల మణిలత, 21వ వార్డు బోలగాని వీణ, 22వ వార్డు ఎల్గూరి అలివేలు, 23వ వార్డు వల్దాస్ లక్ష్మణ్, 24వ వార్డు ఎస్ రాము, 25వ వార్డు యాటా శ్రీదేవి, 26వ వార్డు పోలగాని మాధవి, 27వ వార్డు బైరు పద్మ, 28వ వార్డు సండ్రపాటి విజయకుమార్, 29వ వార్డు రాపర్తి భవాని, 30వ వార్డు నామా అరుణ, 31వ వార్డు కొండపల్లి దిలీప్ రెడ్డి, 32వ వార్డు కుంభం రాజేంద్రప్రసాద్, 33వ వార్డు నాగుల శ్రీనివాస్, 34వ వార్డు షేక్ సాజిద్‌ఖాన్, 35వ వార్డు జ్యోతి శ్రీవిద్య, 36వ వార్డు షేక్ మల్సూర్‌బీ, 37వ వార్డు బైరు శైలేందర్ గౌడ్, 38వ వార్డు ఎల్గూరి లక్ష్మీ నరసింహ, 39వ వార్డు గద్దం భాగ్యలక్ష్మి , 40వ వార్డు కొంతం రాజేష్ రెడ్డి, 41వ వార్డు యండి షఫిఉల్లా, 42వ వార్డు రుద్రంగి రవికుమార్, 43వ వార్డు రేణుక సికందర్, 44వ వార్డు గునగంటి హేమ, 45వ వార్డు పెద్దిరెడ్డి ఉపేంద్ర, 46వ వార్డు మొరిశెట్టి నివేదిత, 47వ వార్డు కుమ్మరికుంట్ల వేణుగోపాల్, 48వ వార్డు వెలుగు వెంకన్నలు ఉన్నారు.

## ఆశావహుల్లో లబ్ డబ్!




ప్రజాపక్షం/హాలియా: మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థుల జాతకాలు నేడు బహిర్గతం కానుండడంతో ఆశావాహుల్లో లబ్ డబ్ మొదలైంది.బరిలో నిలిచే అభ్యర్థులు ఆర్థికంగా ఎన్నికలను ఎదుర్కొనే విధంగా ఉండాలని ఆయా పార్టీలు అభ్యర్థులకు కరాకండిగా చెబుతున్నాయి. ఆర్థికంగా ఒకటే సరిపోదని పోటీ చేసే అభ్యర్థికి సామాజిక అవగాహన కలిగి ఉండి సేవా కార్యక్రమాలు చేసి ఉండాలనే నిబంధన కూడా ఉన్నట్లు తెలుస్తుంది.ప్రజలలో చురుకుగా వ్యవహరిస్తూ అందరితో మమేకమై నాయకత్వ లక్షణాలు గల అభ్యర్థులను పరికరాలు తీసుకొని వారిపై సర్వేలు చేపట్టారు.దీనికి అనుగుణంగా అభ్యర్థుల వివరాలు వారిపై క్షేత్రస్థాయిలో ప్రజలకు ఉన్న అభిప్రాయాన్ని కూడా పరిగణలోకి తీసుకొని బీఫామ్ ఇవ్వనున్నట్లు సమాచారం.ప్రధానంగా అధికార పార్టీలో ఎమ్మెల్యే అన్నీ తానై వ్యవహరిస్తూ వివాద రహితులకు, ప్రజల్లో మంచి అభిప్రాయం ఉన్న నాయకుల్కి గెలుపు గుర్రాలకే టికెట్లు ఇస్తామని చెబుతూ అభ్యర్థులకు వివరిస్తున్నారు.దీంతో ఆశావాహుల గుండెల్లో లబ్... డబ్ మొదలైంది. ప్రధాన పార్టీల్లో క్రమశిక్షణ కలిగిన నాయకులకే మున్సిపల్ ఎన్నికల్లో పెద్ద పీట వేస్తారనే అభిప్రాయాన్ని ఆయా పార్టీ ఆది నాయకులు అభ్యర్థుల్లో కల్పించారు. ప్రతిపక్ష పార్టీ కంటే అధికార పార్టీలోనే ఎక్కువ పోటీ నెలకొనడం సాధారణమైన ఆశావాహులు ఎక్కువ కావడం కొంత అధికార పార్టీకి తలనొప్పిగా మారింది. అయితే గత ఎన్నికల్లో అప్పటి అధికార పార్టీ టిఆర్ఎస్ నుంచి గెలిచిన నాటి మూడో వార్డు కౌన్సిలర్ అన్నేపాక శ్రీనివాస్ తర్వాత రాజకీయ సమీకరణలు మారి శాసనసభ ఎన్నికల్లోనే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ గెలిచి రెండేళ్ల తర్వాత జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో నాటి మూడో వార్డు ప్రస్తుతం ఆరో వార్డు అయింది. అప్పుడు కౌన్సిలర్ గా ఉన్న శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటికీ ప్రస్తుత రాజకీయ సమీకరణలలో ఆయనకు టికెట్ రాదని ముందుగానే పసిగట్టి బీఆర్ఎస్ పార్టీలో చేరి ఆరో వార్డు లో కౌన్సిలర్ గా పోటీ చేసేందుకు సిద్ధమవటం గమనార్హం. అధికార పార్టీలో ఆశావాహులు ఎక్కువ ఉన్నప్పటికీ గెలిచే అభ్యర్థుల పైన దృష్టి సారించిన ఎమ్మెల్యే ఆదిశగా వారికి బీఫామ్‌లు ఇవ్వనున్నట్లు సమాచారం. ఈ ఉత్కంఠకు నేటితో తెరపడ నుండడంతో ఆశావాహులు ఎడతెగని చర్చలు చేస్తూ బీఫామ్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తుండడం గమనించదగ్గ విషయం.



## రామలింగంపల్లి గ్రామ శాఖ నూతన కమిటీ

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : మండలంలోని రామలింగంపల్లి కాంగ్రెస్ గ్రామ శాఖ, యువజన నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఏకగ్రీవంగా సోమవారం జరిగిన ఈ ఎన్నికలలో గౌరవ అధ్యక్షులుగా బంటు గణేష్, మండల వెంకటయ్య, గ్రామ శా ఖ అధ్యక్షులుగా మండల నర్సింహా, ఉపాధ్యక్షులుగా రామావత్ రవి, గంగాదేవి కొండల్, మంచాల కృష్ణకుమార్, ప్రధాన కార్యదర్శిగా నేతావత్ శ్రీశెలం, సహాయ కార్యదర్శిగా బంటు శ్రీశెలం, కోశాధికారిగా బండారి కృష్ణ, సహాయ కోశాధికారిగా బంటు లింగస్వామి, సాంస్కృతిక కార్యదర్శిగా బంటు పరమేష్, కార్యవర్గ సభ్యులుగా బంటు చంద్రయ్య, బంటు పరమేష్, లకావత్ రాములు, రామావత్ రవి, మండల దుర్గ ప్రసాద్, మండల కొండల్‌లు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

## ఆకాంక్షలు నెరవేరుస్తా



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : ప్రజల ఆశీర్వాదంతో గెలిచానని వారి ఆకాంక్షల మేరకు గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని రామలింగంపల్లి సర్పంచ్ రేణుక శంకరయ్య అన్నారు. సోమవారం రామలింగంపల్లి నుండి నరసమ్మ కుంట రోడ్డు మరమ్మత్తులు చేసి గ్రామ ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాములు నాయక్, ఉపసర్పంచ్ రాజు నాయక్, వార్డ్ మెంబర్స్ హరికృష్ణ, ధర్మ మహేందర్ రెడ్డి, శ్రీశైలం, మాజీ ఉపసర్పంచ్ మండల నరసింహ పాల్గొన్నారు.

## నూతన సర్పంచ్‌లకు సన్మానం



**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం)**: మండలంలోనీ వివిధ గ్రామాలకు నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాము నాయక్, సూపరిండెంట్ లోకేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు ఉపేందర్ రెడ్డి, ఎర్ర సోమిరెడ్డి, బీసు ధనలక్ష్మి, కొసన లక్ష్మమ్మ, నాగుల సత్యనారాయణ యాదవ్, కొంగరి యాదగిరి, కట్టెకోల శ్రీహరి, కట్టకోల సుశీల, తండ మంజుల, సోలిపురం ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

## తపస్ జిల్లా కార్యదర్శిగా వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) నల్గొండ జిల్లా కార్యదర్శిగా ఉపాధ్యాయులు నేలంటి వెంకటేశ్వర్లును ఎంపిక చేసినట్లు తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం పక్షాన తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఎన్నికైన నేలంటి వెంకటేశ్వర్లను దేవరకొండ డివిజన్ పరిధిలోని తపస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అభినందించారు.

## ఇంటింటికి ఓటరు స్లిప్‌లు పంపిణికి చర్యలు




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఇంటింటికి ఓటరు స్లిప్‌లను పంపిణి చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు మున్సిపల్ కమీషనర్ గణవేని శ్రీనివాస్ అన్నారు. సోమవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి ఓటరు వేసేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఫోటోలతో కూడిన ఓటరు స్లిప్‌లను ఓటర్లందరికి అందేలా బీఎల్‌వోలకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. నామినేషన్ల ఉపసంహరించుకునే అభ్యర్థుల కోసం దరఖాస్తు ఫారాలు సిద్ధంగా ఉంచామన్నారు. ఎన్నికల పోటీ నుంచి తప్పుకునే అభ్యర్థులు దరఖాస్తు ఫారాలను నింపి నామినేషన్ సమర్పించిన కేంద్రాల్లో సమర్పించాలన్నారు. వారికి అవగాహన కల్పించేందుకు సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. నేడు ఉపసంహరణ ప్రక్రియ పూర్తయిన అనంతరం అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తామన్నారు. కాగా ఎన్నికల నిర్వహణ అధికారి బాలాజీనాయక్ పలు అంశాలపై బీఎల్‌వోలకు శిక్షణ ఇచ్చారు. సమావేశంలో అధికారులు బాలాజీనాయక్, గుడిపాటి కోటయ్య, బక్కయ్య, నాయకులు నూకల వేణుగోపాల్‌రెడ్డి, డబ్బికార్ మల్లేష్, ఇలియాస్, ప్రవీణ్‌కుమార్, నోడల్ అధికారి బక్కయ్య, మెప్మా కమ్యూనిటి ఆర్గనైజర్లు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సతీష్ పాల్గొన్నారు.

## జనరల్ స్థానాల్లో బిసిలకు బీఫామ్‌లు ఇవ్వాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఎవరి జనాభా ఎంతో వారికి అంత వాటా దక్కాలనే కాంగ్రెస్ నినాదాన్ని తూ.చ తప్పకుండా పాటిస్తూ మిర్యాలగూడ మున్సిపల్ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో నామినేషన్ వేసిన బీసీలందరికి బీఫాంలు ఇవ్వాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అన్నారు. సోమవారం ఆయన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిని కలిసి వినతి పత్రం అందించి మాట్లాడారు. చట్టపరంగా రిజర్వేషన్లు బీసీలకు కల్పించకపోతే పార్టీపరంగా ఖచ్చితంగా కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో చెప్పిందని, కనుక మున్సిపల్ ఎన్నికల్లో బీసీల జనాభా ప్రకారం టికెట్లు కేటాయించాలని, కాంగ్రెస్ పార్టీకి బీసీలపై చిత్తశుద్ధి ఉంటే 56శాతం బీఫాంలు బీసీలకు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికల కంటే మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు ఎక్కువ శాతం సీట్లు కేటాయించామని, పార్టీపరంగా బీసీలకు రాజకీయ అవకాశాలు పెంచడానికి అన్ని విధాలుగా ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు ఉన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థికి బ్రహ్మరథం పడుతున్న ప్రజలు



**ప్రజాపక్షం/ఆలేరు :** ఆలేరు మున్సిపాలిటీలోని 1వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి చింతల ఫణి సునీత శ్రీనివాస్ రెడ్డి వార్డులో గడప గడపకు తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలను వార్డు సభ్యులకు వివరించారు. గతంలో తాము కౌన్సిలర్‌గా ఉన్నపుడు అధికార పార్టీలో లేకున్నా దాదాపు 80 లక్షలతో 1వ వార్డులో అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. ఈ ప్రచారంలో యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు నీలం పద్మ వెంకట స్వామి, కృష్ణ, శ్రీలత, ఎండి బాబా, పాషా, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## కిట్స్ మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు



**ప్రజాపక్షం/కోదాడ:** స్థానిక కిట్స్ మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించినట్లు కళాశాల చైర్మన్ నీలా సత్యనారాయణ తెలిపారు. సోమవారం హైద్రాబాద్‌లోని ప్రముఖ కోర్ కంపెనీ ఐన సంగ్లారే ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించడం జరిగిందన్నారు. సంగ్లారే టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ హ్యూమన్ రిసోర్స్ ప్రతినిధులు నాని బాబు, సౌమ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో కిట్స్ మహిళ ఇంజనీరింగ్ కళాశాల బిటెక్ విద్యార్థులు 33 మంది, డిప్లోమా విద్యార్థినులు 7గురు ఎంపికయ్యారు. ఎంపికైన వారికి విద్యార్థినులకు వార్షిక వేతనం రూ.4 లక్షల రూపాయలు ఉంటుందని కంపెనీ మానవ వనరుల అధికారులు నానిబాబు, సౌమ్యలు తెలిపారు. ప్రాంగణ ఎంపికలకు ఎంపికైన విద్యార్థినులను కళాశాల చైర్మన్ నీలా సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డాక్టర్ పెరుమాళ్లపల్లి గాంధీ, డైరెక్టర్ నాగార్జునరావు, టిపివో పుష్పలత, అధ్యాపకులు పాల్గొన్నారు.

## గులాబీ జెండాదే విజయం

**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ మున్సిపాలిటి పరిధిలో ఈనెల 11న జరగనున్న ఎన్నికల్లో టిఆర్ఎస్ పక్షాన ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు విజయం సాధిస్తారని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బిఆర్ఎస్ పార్టీలో చేరిన గోపిదేవి లక్ష్మిని 14వ వార్డు టిఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించారు. గులాబీ కండువా కప్పి ఆమెను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఎస్‌కె నయీం, మాదాల ఉపేందర్, ఎడవల్లి వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, ప్రసాద్, నాగేశ్వరరావు, పార్టీలో చేరిన వారు ఉన్నారు.





## పాత పేరుతోనే కొనసాగించాలి

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** బ్రిటిష్ సామ్రాజ్యవాదులతో కొట్లాడి అహింస పద్దతిలో దేశానికి స్వాతంత్ర్యం తీసుకవచ్చిన మహాత్మా గాంధీ పేరును జాతీయ గ్రామీణ ఉపాధి పథకానికి పెట్టడం జరిగిందని, ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బిజేపి ప్రభుత్వం తొలగించి కొత్తగా జీ రామ్‌జీ పెట్టడం సిగ్గుచోటు అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, మండల కార్యవర్గ సభ్యులు త్రిపురం సుధాకర్‌రెడ్డి, ఎడ్ల అంజిరెడ్డి, కుందూరు వెంకటరెడ్డి, పోకల ఆంజనేయులు, పంగ గోవింద్, వెంకన్న, నబిసాహెబ్, ప్రధాని సైదులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక క్షేత్రాలు దేవాలయాలు



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** ః ఆధ్యాత్మిక క్షేత్రాలు గ్రామాలలోని దేవాలయాలలో జరిపే బ్రహ్మోత్సవాలు సమభావన చాటే వేదికలుగా విరాజిల్లుతున్నాయని టిఆర్ఎస్ పార్టీ భువనగిరి ఇంచార్జ్ క్యామ మల్లేశం అన్నారు. భుదాన్ పోచంపల్లి మండలం పెద్దరావులపల్లి గ్రామంలో కొలువైన శ్రీశ్రీశ్రీ భూనీలా సమేత శ్రీ రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలలో సోమవారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకుని రథోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పోచంపల్లి మాజీ ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్ రెడ్డి, మాజీ జడ్పిటిసి కోట మల్లారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పాటి సుధాకర్ రెడ్డి, దేవాలయ చైర్మన్ సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బిఫామ్‌ల అందజేత



**ప్రజాపక్షం/చిట్యాలః** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి ఎన్నికలలో పోటీచేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులకు సోమవారం రోజున స్థానిక శాసనసభ్యులు వేముల వీరేశం, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పోకల దేవదాస్‌లు బి ఫాంలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసేందుకు ముందుకు వచ్చిన అభ్యర్థులు గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పోకల దేవదాసు, ఆలయ కమిటి చైర్మన్ మారగోని అంజనేయులు, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షులు జడల చిన మల్లయ్య, నాయకులు పాటి మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మరో గ్రంథాలయ ఉద్యమ బస్సుయాత్ర



**ప్రజాపక్షం/కోదాడ:** పుస్తకాలు జీవితాలను మారుస్తాయని, విద్యార్థి దశ నుండే విద్యార్థులు విజ్ఞాన సంబంధమైన పుస్తకాలు, కథల పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞాన సంబంధమైన పుస్తకాల ద్వారా విజ్ఞానవంతులు అవుతారని జిల్లా గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మరో గ్రంథాలయ ఉద్యమ బస్సుయాత్ర సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తమ తెలివిని పెంపోందించు కోవడానికి రోజు ఓ పిరియడ్ బడిలో ఇతర పుస్తకాలను చదవడం అడిగి తెలుసుకోవడం దాని ద్వారా జీవితంలో ఎదురయ్యే సమస్యలని జీవితంలో ఎదుగుదలకు ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎస్‌కె సలీంషరిఫ్, ప్రధానోపాధ్యాయులు మార్కేండేయ, పందిరి నాగిరెడ్డి, ముత్తవరపు రామారావు, రవికుమార్ పాల్గొన్నారు.



## సమస్యల పరిష్కారానికి కృషి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఫిర్యాదుదారుల సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని ఫోన్ ద్వారా పోలీసు అధికారులకు జిల్లా ఎస్‌పి కె నరసింహా సూచనలు చేశారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్‌డే సందర్భంగా ఫిర్యాదుదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించి మాట్లాడారు. చట్టాన్ని అమలు పరచడంలో ఎలాంటి అలసత్వం చూపరాదని, ప్రతి కేసును పారదర్శకంగా ఇన్వెస్టిగేషన్ చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. గ్రీవెన్స్‌డే ద్వారా వచ్చిన ఫిర్యాదుల స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు.

## నర్సరీని పరిశీలన



**ప్రజాపక్షం/చివ్వెంల :** మండల కేంద్రంలోని నర్సరీని డిఆర్‌డిఓ శిరీష సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని అన్ని గ్రామాల నర్సరీలను పాటింగ్, మిక్సర్ బ్యాగ్స్‌లలో నింపి ఉదయం సాయంత్రం నీళ్ళు కొట్టించాలన్నారు. పండ్ల మొక్కలు, రోడ్ల వెంట పెట్టే మొక్కలను విత్తనాలు పెట్టించాలని సూచించారు. ఆమె వెంట మండల అధికారులు, సర్పంచ్ ఏర్పుల కళ్యాణి పాల్గొన్నారు.

## రాష్ట్రానికి అన్యాయం

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** కేంద్ర బిజెపి ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి కావాల్సిన నిధులు కేటాయించడంలో పక్షపాత వైఖరి చూపించిందని బిఆర్ఎస్ తుంగతుర్తి మండల పార్టీ అధ్యక్షులు తాటికొండ సీతయ్య విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి కావల్సిన, రావల్సిన వ్యవసాయ రంగానికి, రైల్వే, విమానాయాన రంగాలకు నిధులు కేటాయించలేదని మండిపడ్డారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు గుండగాని రాములు గౌడ్, మండల నాయకులు తునికి సాయిలు గౌడ్, గోపగాని రమేష్ గౌడ్, చింతకుంట్ల భాస్కర్, గోపగాని వెంకన్న పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న సిఐ

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** అగ్నికీలలు చుట్టుముట్టి గూడు కాలిపోయిన ఘటనలో సర్వం కోల్పోయిన దంపతులను ఓదార్చి, మఠంపల్లి ఎస్ఐ బాబుతో కలిసి నిత్యావసర సరుకులు, బియ్యం అందించి హుజూర్‌నగర్ సిఐ చరమందరాజు మానవత్వం చాటుకున్నారు. జనవరి 30న మఠంపల్లి మండలం బక్కమంతుల గూడెం గ్రామానికి చెందిన షేక్ ఖాసీం ఆశ దంపతులకు చెందిన గృహం షైర్ యాక్సిడెంట్ జరిగి అగ్నికీలల్లో ఆహుతైంది. గృహంలో ఉన్న కొంత డబ్బు బంగారంతో పాటు సర్వం కాలి బూడిదయ్యాయి. ఈ విషయంపై స్పందించిన సిఐ చరమందరాజు సోమవారం మఠంపల్లి ఎస్ఐ బాబుతో కలిసి ఆ దంపతులను ఓదార్చి నిత్యావసర సరుకులతో పాటు బియ్యం అందించి మానవత్వం చాటుకున్నారు.




## జెబిఎం డ్రైవర్లపై యూనివర్సల్ ఆపరేషన్ మేనేజర్ వేధింపులు



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జెబిఎం సంస్థకు సంబంధించిన సూర్యాపేట యూనివర్సల్ ఆపరేషనల్ మేనేజర్ తమను తీవ్రంగా వేధిస్తున్నాడని జెబిఎమ్ ఎలక్ట్రిక్ బస్సుల డ్రైవర్లు, సిబ్బంది ఆరోపించారు. సమస్యలను తెలియజేస్తే చాట్ కంట్రోలర్‌కు చెప్పి డ్యూటీలు వేయవద్దని, వాట్సాప్ గ్రూపుల నుంచి తొలగించాలని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆర్‌టిసి డిపో వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో పలువురు డ్రైవర్లు మాట్లాడుతూ తమకు ఇప్పటి వరకు ఐడి కార్డులు కూడా ఇవ్వలేదని, వేతనం ఎంత ఇస్తారో స్పష్టత లేదని వాపోయారు. ఎలక్ట్రికల్ బస్సులకు సరైన హారన్ లేకపోవడంతో రోడ్డు ప్రమాదాల ముప్పు ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బస్సులకు ఏదైనా డ్యామేజ్ జరిగితే డ్రైవర్ల నుంచి డబ్బులు వసూలు చేసి, ఆ మొత్తాన్ని జెబిఎమ్ సంస్థకు చెల్లించకుండా డ్రైవర్ల వేతనాల్లోనే కోత విధిస్తున్నారని ఆరోపించారు. నెలలో 13 డ్యూటీలు చేసిన వారికే వీక్లీ ఆఫ్ ఇస్తున్నారని, చేయని వారికి వేతనాల్లో కోత పెడుతున్నారని తెలిపారు. మద్యం సేవించారనే ఆరోపణలతో బ్రీత్ అనలైజర్ పరీక్షల్లో తక్కువ శాతం చూపించి కొందరు డ్రైవర్లను తొలగించారని, అయితే ఇటీవల 94 శాతం వచ్చిన డ్రైవర్‌ను తిరిగి విధుల్లోకి తీసుకున్నారన్నారు. ప్రారంభంలో నెలకు రూ.26వేల వేతనం ఇస్తామని చెప్పి, ప్రస్తుతం కేవలం రూ.20వేలు చెల్లిస్తున్నారని అన్నారు. పిఎఫ్ కూడా యాడ్ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం బస్సు పాస్ సౌకర్యం కూడా కల్పించడం లేదని వాపోయారు. సూర్యాపేట డిపోలో 79 ఎలక్ట్రిక్ బస్సులు ఉండగా సుమారు 250 మంది డ్రైవర్లు అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్నారని తెలిపారు. విధుల నుంచి తొలగిస్తారనే భయంతో చాలామంది డ్రైవర్లు బయటకు రావడం లేదని చెప్పారు. చార్టులో సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వకుండా జూనియర్లకు ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. బస్సులను చార్జింగ్ పేరుతో సకాలంలో అందుబాటులో ఉంచకపోవడం వల్ల తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థపై ప్రయాణికుల్లో విశ్వసనీయత కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందోని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సిబ్బంది సైమన్, చైతన్య, అనుదీప్, డ్రైవర్లు నాగరాజు, ప్రవీణ్ కుమార్, నరేష్, మహేష్, సందీప్ పాల్గొన్నారు.

## నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

**ప్రజాపక్షం/తిప్పర్తి:** పాఠశాలలో జరిగిన నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలని బదాయి గడ్డ ప్రాథమిక పాఠశాల చైర్మన్ మెగావాత్ బుజ్జి డిమాండ్ చేశారు. నిధులు దుర్వినియోగంపై జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ కి ఫిర్యాదు చేశారు.సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో పాఠశాల చైర్మన్ మెగావత్ బుజ్జి మాట్లాడుతూ బదాయిగడ్డ పాఠశాలకు పీఎం సిరి పథకంలో భాగంగా పాఠశాలల్లో వసతుల కల్పనకు సుమారు రూ.11 లక్షల నిధులు మంజూరు అయ్యాయి.ఇట్టి నిధులను పాఠశాల అభివృద్ధి పనులకు సక్రమంగా వినియోగించకుంటా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిధులు గోల్మాల్ చేసినట్లు ఆరోపించారు.పాఠశాల చైర్మన్ తీర్మానం లేకుండా బ్యాంక్ అకౌంట్ నుండి డబ్బులు డ్రా చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.బదాయి గడ్డ పాఠశాలకుకేటాయించిన నిధులపై తక్షణమే విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలన్నారు.




**నిబంధనలను అతిక్రమించిస్తే :ఎంఈఓ రవికుమార్**

పాఠశాలకు వచ్చిన నిధులు పీఎం సిరి నిబంధన ప్రకారం ఖర్చు చేయాలన్నారు. నిబంధనలను అతిక్రమించి నిధులు దుర్వినియోగం చేస్తే జిల్లా అధికారుల ఆదేశానుసారం చర్యలు తీసుకుంటామ అని ఎంఈఓ రామావత్ రవికుమార్ వివరణ ఇచ్చారు.

## గ్రామ పంచాయతీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం వంగాల, పాచిల్ల, సూనెగూడెం గ్రామాలలోని గ్రామపంచాయతీ కార్మికులతో సోమవారం గ్రామ కమిటీలను వేయడం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పొట్ట యాదమ్మ హాజరై మాట్లాడుతూ గ్రామ పంచాయతీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ. 18వేలు ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, సంవత్సరానికి రెండు జతల యూనిఫాంలు, సానిటైజర్లు, గ్లౌజులు, సోపులు, మాస్కులు అందించాలని, ఆరోగ్య బీమా, ప్రమాద బీమా కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామ కమిటీలను ఎన్నుకోవడం జరిగింది. ఈకార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ మండల అధ్యక్షులు ఇటికాల పరశురాములు, గ్రామ పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌సి,ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్ డైరీలను ఆవిష్కరణ

**ప్రజాపక్షం/మర్రిగూడ:** ఎస్‌సి,ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్ డైరీలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దామెర భీమనపల్లిలో సోమవారం ఆసంఘం రాష్ట్ర కోశాధికారి ఉదావత్తు లచ్చిరాం ఆవిష్కరించి మాట్లాడుతూ ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలను దశల వారీగా ప్రభుత్వము విడుదల చేయడం సంతోషకరమైన విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గ్యార వెంకటయ్య,ఉపాధ్యాయులు సంజీవరావు, సికిందర్, ఫరంగి వెంకటయ్య, సభావాత్ వెంకట్ కుమార్,కొండా శ్రీనివాస్, స్వరూప, నీలిమ,మంజుల పాల్గొన్నారు.



## కల్నల్ సంతోష్ బాబు మాతృమూర్తిని ఏకగ్రీవం చేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** భారతదేశం కోసం గాల్వాన్ లోయలో చైనా ముష్కరుల దాడిలో కన్న బిడ్డను త్యాగం చేసిన మహనీయురాలు బిక్కుమళ్ళ మంజులను 44వ వార్డు కౌన్సిలర్‌గా అన్ని రాజకీయ పార్టీలు ఏకమై ఏకగ్రీవం చేయాలని ఆర్యవైశ్య మహాసభ జిల్లా క్రమశిక్షణ సంఘం కమిటీ చైర్మన్, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారు రాజా సోమవారం ఒక ప్రకటనలో కోరారు. 44వ వార్డులో పోటీచేస్తున్న ఇండిపెండెంట్ అభ్యర్థులు సహకరించాలని కోరారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన ఆ మహనీయునికి మన మిచ్చే ఘనమైన నివాళి మంజులను వార్డు కౌన్సిలర్‌గా ఏకగ్రీవం చేయడమేనన్నారు. దేశం కోసం తన ఏకైక కన్న బిడ్డను త్యాగం చేస్తే మంచి మనస్సుతో అన్ని రాజకీయ పార్టీలు కనీసం ఒక్క మున్సిపల్ కౌన్సిలర్‌గా ఏకగ్రీవం చేయలేమా అని అభ్యర్థించారు.

## బిఆర్ఎస్‌లో చేరిన లక్ష్మికాంతమ్మ



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట పట్టణంలోని 27వ వార్డు మాజీ కౌన్సిలర్ చిరివెళ్ల లక్ష్మి కాంతమ్మ, ఆమె కుమారుడు చిరివెళ్ల శబరి సోమవారం ఆ వార్డుకు చెందిన సుమారు 60 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి మళ్ళీ బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యాలయంలో వారికి మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి గులాబీ జెండాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## ఉపాధిహామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలి

**ప్రజాపక్షం/మునగాల:** కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిన విబిజి రామ్‌జీ పథకాన్ని రద్దు చేసి, 2005 ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని అఖిల భారత రైతు కూలి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మందారి డేవిడ్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని కొక్కిరేణి గ్రామంలో జరిగిన అఖిల భారత రైతుకూలి సంఘం డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2005 సంవత్సరంలో పార్లమెంట్‌లో అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించి 2006 ఫిబ్రవరి 2 నుండి దేశంలో అమలు జరుగుతున్న మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి దాని స్థానంలో బిజెపి కేంద్ర ప్రభుత్వం వికాసిత్ భారత్ రామ్‌జీ పథకాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పోటు లక్ష్మయ్య, డివిజన్ అధ్యక్షులు పోరెల్లి నాగయ్య, సభ్యులు లక్ష్మి నర్సయ్య, సైదా, బాలయ్య, బ్రహ్మం పాల్గొన్నారు.

## వీధి కుక్కల దాడిలో 12 గొర్రెలు మృతి

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని గ్రామ సమీపంలో రైతు దేవనబోయిన సోమ నర్సయ్యకు చెందిన గొర్రెల దొడ్డిలోకి ఆదివారం రాత్రి వీధి కుక్కలు చొరబడి దొడ్డిలో ఉన్న గొర్రెల పై దాడి చేయగా సుమారు రూ. 2లక్షల విలువగల 12 గొర్రెలు మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ దేవనబోయిన ఐలయ్య, ఉప సర్పంచ్ ఆవుల ప్రసాద్‌లు సంఘటన స్థలాన్ని పరిశీలించి మాట్లాడుతూ వీధి కుక్కల దాడిలో గొర్రెలు మరణించడంతో నష్టపోయిన రైతును ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. వారి వెంట వార్డు సభ్యులు ఉపేందర్ తదితరులు ఉన్నారు.





## డిపిఆర్ఓగా శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సూర్యాపేట జిల్లా నూతన పౌర సంబంధాల అధికారి(డిపిఆర్ఓ)గా వి శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, అదనపు కలెక్టర్ కె సీతారామారావులను మర్యాదపూర్వకంగా కలిశారు.

## మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక

**ప్రజాపక్షం/నాంపల్లి:** మండల సర్పంచ్‌ల,ఫోరం అధ్యక్షునిగా,మండలంలోని నెమిల్ల గూడెం గ్రామ సర్పంచ్ ఏ రెడ్ల నారాయణరెడ్డిని శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకం తోటి మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు,నాఎన్నికకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు,నాకు ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ సర్పంచ్‌ల,సమస్యల పట్ల, సర్పంచ్‌ల,గ్రామాల అభివృద్ధికై ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు.

## ఇరిగేషన్ ఎఇకి వినతి

**ప్రజాపక్షం/చింతలపాలెం :** చింతలపాలెం రెవెన్యూ గ్రామ పంచాయితీకి సంబంధించిన రైతుల పంట పొలాలకు వెళ్లే రోడ్లకు లిఫ్ట్ ద్వారా తీసిన మట్టిని రైతులకు తొలి ఉపయోగపడే విధంగా కృషి చేయాలని చింతలపాలెం గ్రామ సర్పంచ్ కందుల రామకోటిరెడ్డి గ్రామ పంచాయితీ తరపున ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్యనారాయణను కోరారు. దీనికి ఇరిగేషన్ ఏఈ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు మోర్తాల వెంకటరెడ్డి, సిపిఎం గ్రామ కార్యదర్శి జంగాల పుల్లయ్య, బిఆర్ఎస్ నాయకులు షేక్ మైబెల్లి, పేరు పొంగు శ్రీను పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండలంలోని గూడూరు గ్రామంలో గల శ్రీ ఉమామహేశ్వర ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయ తృతీయ వార్షికోత్సవం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డికి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆలయ చైర్మన్ గడ్డం కౌసల్యబాల్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గూడూరు గ్రామంలో ఆర్టీసీ బస్సులు ఆపడానికి రీజినల్ మేనేజర్‌తో మాట్లాడి ఆపేందుకు ప్రయత్నిస్తానని తెలియజేశారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ బింగి అలివేలు మంగ శ్రీనివాస్, ఉప సర్పంచ్ జానా సత్యనారాయణ, నాయకులు బోయపల్లి నరసింహారెడ్డి, అంకర్ల అశోక్, శ్రీరాములు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## మహిళా సమాఖ్య నూతన భవనాల పనులకు శ్రీకారం



**ప్రజాపక్షం/నాంపల్లి:** మండలంలోని రేవెల్లి,వడ్డేపల్లి,మహమ్మదాపురం పలు గ్రామాలలో ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన రూ.10లక్షలు ప్రభుత్వ నిధులతో నిర్మించనున్న గ్రామ మహిళా సమాఖ్య నూతన భవనాలకు రేవల్లి సర్పంచ్ బట్టు శ్రీనివాస్,వడ్డేపల్లి సర్పంచ్ జంపాల లక్ష్మి సైదులు, మహమ్మదాపురం సర్పంచ్ బొమ్ము సంతోష చంద్రశేఖర్ సోమవారం భూమి పూజ నిర్వహించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా సంఘాల సమావేశాలు,కార్యకలాపాల కోసం ఈభవనం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసి మహిళలకు అందుబాటులోకి తీసుకొస్తామని సర్పంచులు తెలిపారు.ఈకార్యక్రమంలో వడ్డేపల్లి ఉప సర్పంచ్ బుషిపాక యాదయ్య, విబికె రజిత, వార్డు సభ్యులు,పూలగోని లక్ష్మమ్మ జంగయ్య,జెట్టనవోని శంకర్ పాల్గొన్నారు.

## ఉద్యోగ పదవీ విరమణ సన్మానం



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** లక్ష్మి దేవికాల్వ ఉద్యోగ సహకార సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వివిధ రకాల రంగాలలో సర్వీస్ పూర్తి చేసి పదవి విరమణ చేసిన వారికి ఉద్యోగ సహకార సంఘం ఆధ్వర్యంలో కానుగుల రాము ఆగ్రో కెమికల్ కంపెనీ, బండి భిక్షం టీచర్, పొన్నాల ఉదయ్ కుమార్ ఆర్మీ, పొన్నాల రమేష్ ఆర్మీ, దామెర్ల వీరయ్య ఆర్మీ, బొమ్మగాని భద్రయ్య ఆర్మీలను సర్వీస్ పూర్తి చేసిన సందర్భంగా వారికి ఉద్యోగ సహకార సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో లక్ష్మి దేవికాల్వ ఉద్యోగ సహకార సంఘం అధ్యక్షులు కంచుగట్ల క్రిష్ణయ్య, ప్రధాన కార్యదర్శి దామెర్ల వీరయ్య, ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ వల్లంబట్ల రమాదేవి, ఉపసర్పంచ్ కంబాల వీరయ్య, ఉద్యోగ సహకార సంఘం గౌరవ అధ్యక్షుడు ఎస్‌కె అబ్బాస్ అలీ, సభ్యులు పొన్నాల సత్తయ్య, కందుకూరు అంజయ్య, పొన్నాల నర్సయ్య, కంచుగట్ల వెంకన్న పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ గెలుపు ఖాయం



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో గెలిచి మున్సిపాలిటిలను బిఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకోవడం ఖాయమని హుజూర్‌నగర్ బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి ఒంటెద్దు నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం హుజూర్‌నగర్ మున్సిపాలిటి పరిధిలోని 16 వార్డులో కాంగ్రెస్, టిడిపి నుండి పలువురు నాయకులు బిఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ కౌన్సిలర్లను గెలిపించి హుజూర్‌నగర్ మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకోవాలన్నారు. 16 వార్డు అభ్యర్థి చిట్టిపోతుల భద్రమ్మ విజయానికి కృషి చేయాలన్నారు. పార్టీలో చేరిన వారిలో అప్పనబోయిన సతీష్‌గౌడ్, కోటయ్య గౌడ్, మామిడి వేణు, లింగం రాంబాబు, రామిశెట్టి శ్రీను, పోటు సతీష్, కుమ్మరికుంట్ల కార్తీక్, గొధముల లక్ష్మణ్ కుటుంబాల వారు చేరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు జక్కుల నాగేశ్వర రావు, కొప్పుల సైదిరెడ్డి, కెఎల్ఎన్‌రెడ్డి, బెల్లంకొండ అమర్, పారేపల్లి నర్సింహరావు పాల్గొన్నారు.

## కల్యాణం కమనీయం

### ఘనంగా శ్రీయోగానంద లక్ష్మి నృసింహ స్వామి కళ్యాణం

**ప్రజాపక్షం/అర్వపల్లి :** అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మి నృసింహ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి స్వామి వారి కళ్యాణం కమనీయంగా జరిగింది. ఆలయ కమిటి వారు కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ముందే ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రాత్రి స్వామి అమ్మవార్లను ప్రత్యేక పల్లికిపై ఊరేగిస్తూ కళ్యాణ మండపం వద్దకు తీసుకవచ్చారు. మహిళలు హారతులు ఇచ్చి స్వామి అమ్మవారికి ఎదుర్కోలు కార్యక్రమాన్ని అర్చకులు వేదమంత్రాలతో నిర్వహించారు. ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి స్వామి అమ్మవార్లకు తలంబ్రాలను, పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్ రెడ్డి, ప్రధాన అర్చకులు ధరూరి యోగానందచార్యులు, డైరెక్టర్లు బీరవెల్లి శ్రీధర్ రెడ్డి, సోమయ్య, గ్రామ సర్పంచ్ చలంచర్ల విద్యాసాగర్ పాల్గొన్నారు.



## దేవాలయ భూములను సర్వే చేయాలి

**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** శివాలయం శ్రీవరవర రంగ నాయక దేవాలయ భూముల హద్దులను అధికారిక సర్వే చేయాలని గణపవరం గ్రామ సర్పంచ్ బల్గూరి స్నేహాదుర్గయ్య ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆలయ భూములకు సర్వేచేసి హద్దులు ఏర్పాటు చేయాలని కోరుతూ ఆర్‌డిఓ సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన ఊరు మన వారసత్వం (మేరా గామ్ మేరీ దారోహర్) పథకం కింద గ్రామంలో దేవాలయ భూములను సర్వేచేసి హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామ సాంస్కృతిక వారసత్వాన్ని సంరక్షించుకునేందుకు గ్రామసభ తీర్మానం చేయడం చేసినట్లు తెలిపారు.





## అర్హతకు మించి వైద్యం చేస్తే చర్యలు

**ప్రజాపక్షం/మర్రిగూడ:** జిల్లా వైద్య అండ్ ఆరోగ్యశాఖ అధికారి,దేవరకొండ డిప్యూటీ డిఎంహెచ్ఓ ఆదేశానుసారం ప్రతి మండలంలోని వైద్యాధికారులు ఆయా గ్రామాలలోని ప్రాథమిక చికిత్స కేంద్రాలను తనిఖీ చేయమని ఇచ్చిన ఆదేశాల మేరకు మండల పరిధిలోని కేంద్రాలలో తనిఖీలు నిర్వహించడం జరిగింది. రూల్స్‌కు విరుద్ధంగా అధిక మోతాదులో ఆంటీ బయోటిక్స్,స్టెరాయిడ్స్ ఇచ్చినచో చట్టపరమైన తీసుకోవడం జరుగుతుందని సోమవారం ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ దీపక్ తెలిపారు.వచ్చే వా రంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ సూచనల మేరకు అందరికీ అవగాహన కార్యక్రమం పెట్టడం జరుగుతుంది.ఈకార్యక్రమంలో మండల వైద్యాధికారులు డాక్టర్ శాలిని,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** మండలంలోని చెర్వుగట్టు గ్రామంలో ఉపాధి హామీ పనులను గ్రామ సర్పంచ్ నేతకానీ కృష్ణయ్య ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంను గ్రామంలో ప్రతి ఒక్కరూ వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలని ఆయన కోరారు. అదేవిధంగా కూలీలకు ఉపాధి హామీ డబ్బులు చెల్లించడంలో జాప్యం జరగకుండా చూసుకోవాలని ఉపాధి హామీ సిబ్బందికి ఆయన సూచించారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రేగట్టే నవీన్ రెడ్డి,కార్యదర్శి నన్నూరు రవీందర్ రెడ్డి,వార్డ్ మెంబెర్స్,రేగట్టే ప్రియాంకనరేష్ రెడ్డి,వంటేపాక శిరీషశివ,కూకుట్ల శ్రీకాంత్,చీర సత్తమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ మల్ల ధనమ్మ పాల్గొన్నారు.

## ప్రభుత్వ సహకారంతో సేవ



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి మున్సిపాలిటీ 13వ వార్డు కౌన్సిలర్‌గా భారీ మెజారిటీతో గెలిపిస్తే ప్రభుత్వ సహకారంతో ఎంపీ, ఎమ్మెల్యే, చైర్మన్ ప్రోత్సాహంతో వార్డును అభివృద్ధి చేసి ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ ఫలాలను పేదలకు అందించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని 13వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి సూరేపల్లి రాధిక రమేష్ ఓటర్లను అభ్యర్థించారు. ఈనెల 11న జరిగే ఎన్నికలలో భాగంగా ఆయన 13వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా నామినేషన్ వేసి గడపగడపకు వెళ్లి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.

## లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు



**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండలంలోని గొల్ల గూడెం గ్రామంలో సోమవారం శ్రీ లక్ష్మి నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి పింగళి రెడ్డి స్వామివారి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ మాధవి కుమార్ యాదవ్, ఉపసర్పంచ్ యాస బాలకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ మల్లేష్ యాదవ్, నాయకులు ఉప్పలంచి శ్రీకాంత్ పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ అంతరాయం

**ప్రజాపక్షం/అర్వపల్లి :** మండలంలోని 33/11కెవి అడివెంల సబ్‌స్టేషన్‌లో వేసవి కార్యాచరణలో భాగంగా మంగళవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ కోత విధిస్తున్నట్లు మండల విద్యుత్ అధికారి వాసా శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని తిమ్మాపురం, అడివెముల, కుమ్మరిగూడెం, కుంచమర్తి, ఉయ్యాలవాడ గ్రామాలలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

## జాగ్రత్తలతోనే ఆరోగ్యం

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** జాగ్రత్తలు, అవగాహనతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని న్యూబంజార హిల్స్‌తండ గ్రామ సర్పంచ్ ధరావత్ కవిత రవీందర్ అన్నారు. సోమవారం తండలో ఐఎంసి హైదరాబాద్ బృందం ఆధ్వర్యంలో డాక్టర్ ధరావత్ నాగేందర్, ఆర్‌ఎంపిలు ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యం అనేది కేవలం వ్యాధులు లేకపోవడం మాత్రమే కాదని ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ధరావత్ బాలు నాయక్ పాల్గొన్నారు.

## జాతర హుండీ లెక్కింపు



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండలంలోని గాజుల మల్కాపురం సమ్మక్క సారలమ్మ వన దేవతల మహాజాతర హుండి లెక్కింపు సోమవారం పూర్తైంది. మొత్తం రూ.3,40,293ల ఆదాయం సమకూరినట్లు దేవాలయ కమిటి చైర్మన్ బండి మధుసూదన్ రెడ్డి తెలిపారు. అమ్మవార్లకు కానుకలు సమర్పించిన భక్తులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, ఉపసర్పంచ్ సొంటి ఆంజనేయులతోపాటు కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## ఇరిగేషన్ ఇఇకి వినతి

**ప్రజాపక్షం/చింతలపాలెం :** మండలంలోని పాత వెల్లటూరు వద్ద ప్రభుత్వం నిర్మిస్తున్న మహాత్మా గాంధీ ఎత్తిపోతల పథకం పైపులైన్ పనులు మట్టిని రైతులు పంటపొలాల బాటలకు వినియోగించుకునేలా అధికారులు అనుమతి ఇవ్వాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నందిని ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో కోదాడ ఇరిగేషన్ ఈఈ సత్యనారాయణకు సోమవారం వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో మాట్లాడి అనుమతి ఇవ్వడం జరిగింది. మంత్రి రైతులకు సానుకూలంగా అధికారులకు మట్టి తోలుకోవాలని చెప్పడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరంరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వాంకుడోతు హుస్సేన్, నరేందర్ రెడ్డి, సంజీవరెడ్డి, కారింగుల ఉస్సేన్ పాల్గొన్నారు.



# పుస్తక పఠనంతోనే పరిపూర్ణ విజ్ఞానం



**ప్రజాపక్షం/నకిరేకల్ :** విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా బాహ్య ప్రపంచ జ్ఞానం కోసం గ్రంథాలయాలను విరివిగా వినియోగించుకోవాలని నకిరేకల్ మండల విద్యాధికారి మేక నాగయ్య పిలుపునిచ్చారు. మరో గ్రంథాలయ ఉద్యమం బస్సు యాత్ర సోమవారం నకిరేకల్ పట్టణానికి చేరుకున్న సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించినసదస్సులో ఆయన మాట్లాడారు. గ్రంథాలయాలు ఆధునికయుగంలోవిజ్ఞానాన్ని పంచే దేవాలయాలని, పుస్తక పఠనం ద్వారానే పరిపూర్ణ విజ్ఞానం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.హైదరాబాద్ నుంచి అమరావతి వరకు సాగుతున్న ఈబస్సు యాత్ర విద్యార్థుల్లో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించడం అభినందనీయమని అన్నారు. గ్రంథాలయ ఉద్యమం కన్వీనర్ కస్తూరి ప్రభాకర్,మంచికంటి వెంకటేశ్వర్లు,కాసుల రవికుమార్,బండారు విజయ,డాక్టర్ సాగర్ల సత్తయ్య,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా నిర్వహించుకోవాలి వన్ టౌన్ సిఐ ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి పట్టణ ప్రజలకు సూచించారు.మున్సిపల్ ఎన్నికల సందర్భంగా సోమవారం జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ ఆదేశానుసారం డిఎస్పి కె శివరాం రెడ్డి సూచనల మేరకు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నల్లగొండ పట్టణంలోని వన్‌టౌన్ పరిధిలో 10వ వార్డు కనక దుర్గ కాలనీ,సూర్య వంశీ కాలనీలో ఎన్నికల అవగాహన సదస్సుని నిర్వహించారు.ఈ సదస్సుకి ముఖ్య అతిథిగా వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉందన్నారు. ఈకార్యక్రమంలో వన్ టౌన్ ఎస్ఐబి లచ్చి రెడ్డి,ఏఎస్ఐ వెంకటేశ్వర్లు,హెడ్ కానిస్టేబుల్ లింగా రెడ్డి,శేఖర్,ఇంద్ర రెడ్డి కాలనీ వాసులు పాల్గొన్నారు.

# శ్రీ వేంకటేశ్వరుడి కల్యాణం చూతము రారండి..!



**ప్రజాపక్షం/హాలియా:** అలివేలు మంగ సహిత శ్రీ వేంకటేశుని కళ్యాణం అంగరంగ వైభవంగా జరిపించారు. మండలంలోని మారేపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న అలివేలు మంగ సహిత వెంకటేశుని బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం శ్రీనివాసుని తిరుకల్యాణం భక్తులకు కన్నుల పండువగా చేపట్టారు.వందల సంవత్సరాల క్రితం మారేపల్లి గ్రామంలో కొలువుదీరిన అలివేలు మంగ సహిత శ్రీ వేంకటేశుడికి ప్రతి సంవత్సరం గ్రామస్తులు పెద్ద ఎత్తున ఉత్సవాలను నిర్వహిస్తుంటారు.దీనిలో భాగంగానే గత నెల 27 నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు ఈబ్రహ్మోత్సవాలను చేపడుతున్నారు.దీనిలో భాగంగానే సోమవారం ఉదయం వేద మంత్రాలతో బ్రాహ్మణులు అలివేలు మంగ సహిత వెంకటేశుని తిరు కళ్యాణం కన్నులకు ఇంపుగా భక్తులు కనులు ఆర్పకుండా చూసేలా నిర్వహించిన వేడుక భోళా అనిపించేలా చేపట్టారు.ఈకళ్యాణాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి వందల సంఖ్యలో భక్తులు బారులు తీరారు.

# నేడే నామినేషన్ ఉపసంహరణకు గడువు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న పురపాలక సంఘం 2వ సాధారణ ఎన్నికలలో భాగంగా మున్సిపల్ పోచంపల్లి మున్సిపల్ పట్టణానికి సంబంధించి వేసిన 84 నామినేషన్లలో 11వ వార్డ్‌కు వేసిన నామినేషన్ అభ్యర్థి గడ్డం మహేష్ తన నామినేషన్ ఉపసంహరణ చేసుకున్నట్లుగా సహాయ ఎన్నికల అధికారి అంజన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 84 నామినేషన్లలో 25 మంది అభ్యర్థులు రెండవ సెట్ దాఖలు చేసిన వాటిని పరిగణలోకి రావు. కాబట్టి వాటిని రిజెక్టెడ్ లిస్టులో చేర్చగా మిగిలిన 59 మంది వ్యాలీడ్ క్యాండిడేట్స్లా ఒకటి విత్డ్రా అయినందువలన 58 మందిలో నేడు ఉపసంహరణ చేసుకున్న అభ్యర్థుల తొలగింపు తర్వాత తుది జాబితా విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా వివిధ పార్టీల ముఖ్య నాయకులు పోటీలో నిలిచే అభ్యర్థుల సమర్థత ధన బలాన్ని అంచనాలతో బి ఫామ్ లు ఇచ్చేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశారు. కొంతమంది కౌన్సిలర్ గా పోటీ చేసే అభ్యర్థులను ప్రకటించడంతో ఆయా వార్డులలో ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఒకవైపు కాంగ్రెస్ పార్టీ మరోవైపు టిఆర్ఎస్ ఇంకోవైపు బిజెపి పార్టీలు బలహీనంగా ఉన్న స్థానాలలో అభ్యర్థుల నిలిపి ఏం చేయాలో తోచక తలలు పట్టుకుంటున్నారు. నేడు ఉపసంహరణ జాబితా తర్వాత అసలు రణరంగం మొదలవుతుంది. రాత్రికి రాత్రి రాజకీయ సమీకరణాలు వేగంగా మారిపోయి ఏ అభ్యర్థి ఏ పార్టీలో చేరుతున్నారు. అంతుచిక్కడం లేదు. నేడు అన్నిటికీ తెరపడనుంది.

## తాగునీటి వినియోగంపై అవగాహన



**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండల పరిధిలో అజ్జలాపురం,నర్సింహాపురం గ్రామంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడటమే లక్ష్యంగా,సర్పంచ్ రొక్కం భాస్కర్ రెడ్డి,అధ్యక్షతన ఎంపీడీఓ సమక్షంలో విడబ్ల్యూఎస్సి కమిటీతో సమావేశం నిర్వహించారు.గ్రామస్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా జల సేవ అంకాలన్ కార్యక్రమంలో భాగంగా నీటి లభ్యతను అంచనా వేసి,వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం,రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామంలో నీటి కొరత ఉన్న ప్రాంతాలను గుర్తించి,ఎక్కడైనా లీకేజీలు ఉంటే వెంటనే అరికట్టి,నీటి వృధాను అరికట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చిన్న మునయ్య,ఏఈ,ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు, ఎంపీఓ రవికుమార్,పంచాయతీ కార్యదర్శి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## కెసిఆర్ హయాంలో పట్టణ ప్రగతి

**ప్రజాపక్షం/దేవరకొండ;** కేసిఆర్ హయాంలో పట్టణ ప్రగతి ద్వారా ప్రతి నెలా నిధులు విడుదల చేసి పట్టణాలను సుందరంగా తీర్చిదిద్దడం జరిగిందని బిఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ ఎంఎల్‌ఏ రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. సోమవారం మున్సిపాలిటి ఎన్నికల ప్రచారంలో భాగంగా 2వ వార్డులో మాజీ ఎంఎల్‌ఏ రవీంద్రకుమార్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒక్క రూపాయి కూడా విడుదల చేయడం లేదని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో బిఆర్‌ఎస్ నేతలు బిల్యానాయక్, కిషన్‌నాయక్, మండల పార్టీ అధ్యక్షులు టివిఎన్‌రెడ్డి, బిఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి పొట్ట మురళి, కృష్ణ, బాలు, నాగరాజు పాల్గొన్నారు.

## బుర్రి పుట్టినరోజు వేడుకలు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి,తిప్పర్తి మాజీ జెడ్పిటిసి పాశం రామ్ రెడ్డి,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్‌లు కేక్ కట్ చేసి బుర్రి శ్రీనివాస్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్,మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య,మాజీ డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి పాల్గొన్నారు.

## తెలంగాణకు మొండి చెయ్యి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** తెలంగాణకు మొండి చెయ్యి చూపించి సామాన్యునికి అందని ద్రాక్షలా కేంద్ర బడ్జెట్ ఉందని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ సూర్యాపేట జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ తెలంగాణపై సవతి తల్లి ప్రేమను చూపించినట్లుగా ఉందన్నారు. తెలంగాణకు అన్యాయం చేసిన ఘనత కేంద్ర ప్రభుత్వానిదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కారింగుల వెంకన్న, కొత్తపల్లి రేణుక, ఎర్ర అఖిల్ కుమార్, గొడ్డలి నరసన్న, సురం రేణుక, భీమనపల్లి ప్రకాష్ పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌లో చేరిన కార్తీక్ రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** బిజెపి యువ నాయకులు, 46వ వార్డు మాజీ కౌన్సిలర్ కట్కూరి కార్తీక్ రెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేసి తన అనుచరులతో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సమక్షంలో బిఆర్‌ఎస్‌లో చేరారు. కండువా కప్పి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ పదేండ్ల పాలనలో చేసిన అభివృద్ధిని చూసి ఆయా పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున బిఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ అభ్యర్థులను ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల ఇంచార్జి ఇస్లావత్ రామచంద్రనాయక్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ, నాయకులు ఉప్పల ఆనంద్, మారిపెద్ది శ్రీనివాస్ గౌడ్, జీడి బిక్షం, నెమ్మాది బిక్షం, కీసర వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.





## చిన్నారులకు ఆశీర్వాదం

**ప్రజాపక్షం/నార్కట్ పల్లి** : పట్టణ కేంద్రం కి చెందిన మట్టి కుండల వ్యాపారవేత్త రాధారపు యాదగిరి కుటుంబ శుభకార్యానికి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ముఖ్య అతిధిగా విచ్చేశారు.స్థానిక శబరి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన యాదగిరి,శైలజల కుమారుడు, కుమార్తెల పట్టు వస్త్రలంకరణ శుభాకార్యంలో ఎమ్మెల్యే పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు.ఈకార్యక్రమంలో మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జ్రిపోతుల భరత్ గౌడ్, నాయకులు సట్టు సత్తయ్య,మట్టిపల్లి నాగరాజు,మాదాసు నర్సింహ పాల్గొన్నారు.

## కౌసల్య చిత్రపటానికి నివాళులు

**ప్రజాపక్షం/నకిరేకల్** : సింగిల్ విండో మాజీ చైర్మన్ వీర్లపాటి జానయ్య సతీమణి వీర్లపాటి కౌసల్య ప్రథమ వర్ధంతి సందర్భంగా సోమవారం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పన్నాల రాఘవ రెడ్డి,కోటగిరి ఎల్లయ్య,రాజశేఖర్,నక్షత్,శ్రవణ్ కుమార్,అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

## నూతన కమిటీకి సన్మానం



**ప్రజాపక్షం/నకిరేకల్** : మండలం చందుపట్ల గ్రామంలోని శ్రీశ్రీశ్రీ శంభు లింగేశ్వర స్వామి దేవస్థానంలో నూతనంగా ఎన్నికైన శివాలయ చైర్మన్ నర్సింగ్ సోమేశ్వర్,ధర్మకర్తలు పుట్ట రాజు,వడ్డెబోయిన శివ,బండమీది సంతోష్,గాదె భవానిలను సోమవారం ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ దిగోజు లత వెంకటాచారి,ఉప సర్పంచ్ మంజుల శ్రీను,వార్డు సభ్యులు జిల్లా ప్రవీణ్,కోటగిరి రాధాకృష్ణ,గంగుల వీరయ్య,చింతమల్ల నరేష్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.గ్రామ శాఖ అధ్యక్షుడు రంగారెడ్డి, గ్రామ పెద్దలు కొప్పు సత్తయ్య,బెజవాడ లక్ష్మీనారాయణ, సంజీవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శంకుస్థాపన

**ప్రజాపక్షం/చండూరు:** మండల పరిదిలోని బంగారిగడ్డ గ్రామంలో నూతనంగా మంజూరైన గ్రామ సంఘ బంధం నూతన భవనం నిర్మాణానికి గ్రామ సర్పంచ్ బోయపల్లి సునీత శ్రీనివాస్ ఎంపిడిఓ యాదగిరితో కలిసి భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల నుండి సంఘబంధం భవనం నిర్మాణానికి 10లక్షల నిధులు మంజూరు కావడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్ ఏఈ హృదయ సాగర్‌రెడ్డి, ఏపిఎం యాదయ్య, ఉప సర్పంచ్ మహ్మద్ మహబూబ్ పాల్గొన్నారు.



# ప్రియుడిని సొంతం చేసుకోవాలనే మమతాపై పెట్రోల్ దాడి

### నిందితురాలు సుజాతను జ్యుడిషియల్ రిమాండ్ తరలింపు




**ప్రజాపక్షం/నాంపల్లి:** మండలంలోని కేతపల్లి గ్రామం కుందేళ్ళ నగేష్ తో అక్రమ సంబంధం కొనసాగిస్తున్న అదే గ్రామానికి చెందిన మీసాల సుజాత,తన ప్రియుడి భార్య మమతపై పెట్రోల్ పోసి నిప్పంటించిన విషయం పాఠకులకు విధితమే.ఇట్టి హత్య కేసు విషయమై సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థానిక పోలీస్ స్టేషన్లో నాంపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ దూది రాజు వివరాలు వెల్లడించారు.జరిగిన హత్య కేసులోనిందితురాలు మీసాల సుజాత పోలీస్ స్టేషన్‌కి వచ్చి లొంగిపోవడం జరిగినది.పోలీసుల ఇంటరాగేషన్ ప్రకారం మమత భర్త నగేష్ తో గతం నుండి అక్రమ సంబంధం పెట్టుకొని మీసాల సుజాత కొనసాగిస్తూ ఉండేది.నగేష్ భార్య మమతకు ఇట్టి విషయం తెలియగా,వాళ్ళ తల్లిదండ్రులకు చెప్పడంతో అక్రమ సంబంధం కొనసాగిస్తున్న వాళ్లను పిలిపించి పెద్ద వాళ్ళ సమక్షంలో పంచాయతీ పెట్టి సర్ది చెప్పినారు. అప్పటినుండి నగేష్ తన భార్య మమతతో కలిసి పిల్లలతో సంతోషంగా ఉండేవాళ్ళు.అక్రమ సంబంధం కొనసాగించిన సుజాతను పట్టించుకోకుండా దూరం చేయడం,తన ఫోన్ కాల్ కూడా లిఫ్ట్ చేయకపోవడంతో ఎలాగైనా నగేష్ తనకి దక్కాలని,తనకు దగ్గర కావాలని ఉద్దేశంతోని మమతను చంపేస్తే నగేష్ పూర్తిగా తన వాడు అవుతాడనే ఉద్దేశంతో ఎలాగైనా మమతని చంపాలని అనుకొని అవకాశ కోసం చూస్తూ గత నెల జనవరి 31న తన గ్రామంలో ఉన్న కిరాణా షాప్‌కి వెళ్లి ఒక బాటిల్ పెట్రోల్ తీసుకొని తన ఇంటి వద్దకు వచ్చి అట్టి పెట్రోలును ఆల్రెడీ కట్ చేసుకున్న బాటిల్‌లో పోసి తర్వాత ప్లాన్ ప్రకారం ఒకవేళ పెట్రోల్ పోసిన తర్వాత ఏదైనా ఒకవేళ విఫలమైతే అనే ఉద్దేశంతో ఒక సంచిలో కత్తి,కారంపొడిని కూడా తీసుకొని నేరుగా మమత ఇంటికి వెళ్లింది.ఇంటి ముందు తన బాబుని ఎత్తుకొని కూర్చొని ఉన్న మమతపై మీసాల సుజాత తన వెంట సంచిలో తెచ్చుకున్న పెట్రోల్ మమతపై పోసి నిప్పంటించింది.దానిలో మమతా అక్కడికక్కడే మృతి చెందింది. మమత చంకలో ఉన్న అద్విక్ నందన్ తన చిన్నబ్బాయి కూడా మంటలో కాలి గాయపడిన కుమారుడు హాస్పిటల్ కి తరలిస్తూ మధ్యలో చనిపోవడం జరిగినది.ఇదంతా సుజాత నగేష్‌ని తన వశం చేసుకోవాలని ఈ యొక్క దృశ్చర్యకు పాల్పడిందని పోలీస్ విచారణలో నిర్ధారణ అయినట్లు సీఐ వెల్లడించారు.నిందితురాలు సుజాతను జ్యుడిషియల్ రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచడం జరుగుతుందని నాంపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ కే లింగారెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# మానవత్వం చాటుకున్న సుధాకర్ నాయక్

### కారులో మర్చిపోయిన బంగారాన్ని తిరిగిచ్చిన సుధాకర్



**ప్రజాపక్షం/తుర్కపల్లి** : మానవత్వం మరిచిపోయి ఉరుకుల పరుగుల జీవితంలో సంపాదనకై పరుగెడుతున్న నేటి సమాజంలో తన కారులో ప్రయాణించి, మరిచిపోయి సుమారు 10లక్షల విలువల గల 5 తులాల బంగారం ఆభరణాలు, 70 తులాల వెండిని సదరు బాధితులకు అందచేసి తన మానవత్వాన్ని చాటుకొని నేటి సమాజానికి స్ఫూర్తిగా నిలిచాడు బీల్యానాయక్ తండా యువకుడు మాడోత్ సుధాకర్ నాయక్. వివరాల్లోకి వెళ్తే యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలంలోని బీల్యానాయక్ తండా(మల్కాపూర్)కు చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు తుర్కపల్లి నుండి వరంగల్ వెళుతున్నాడు. స్టేషన్ ఘన్ పూర్ మండలానికి చెందిన సముద్రాల వెంకటయ్య, వారి కుటుంబ సభ్యులు మమ్ముల్ని వరంగల్ వరకు వస్థాము మీ ప్రయాణంలో సహకారం అందించండి అని అడగడంతో అందుకే ఒప్పుకున్న సుధాకర్ తన కారులో వారిని ఎక్కించుకుని ప్రయాణిస్తుండగా స్టేషన్ ఘన్‌పూర్‌లో దిగుతామనడంతో వారిని అక్కడ దింపి వరంగల్ వెళ్లడం జరిగిందని తెలిపారు. తీరా అక్కడికివెళ్లి కారులో చూడగా వెనక సీటులో బంగారు ఆభరణాలు, వెండి ఉన్నాయని, వెంటనే అప్రమత్తమైన సుధాకర్ అంతకుముందు వారి వెంట ప్రయాణించిన వారి వివరాలు తెలుసుకుని వారికి అట్టి విషయం తెలపడంతో అప్పటికి తాము బంగారం పోగొట్టుకున్నామనే భయంతో ఉండగా మీ వస్తువులు మా కారులోనే ఉన్నాయనడంతో గండం నుంచి బయటపడ్డామని కన్నీటి పర్యంతం అయ్యారు. వారి కూతురు వివాహానికి తీసుకొన్న ఆభరణాలు పోయి, దొరకడం, మానవత్వంతో సుధాకర్ నాయక్ తిరిగివ్వడంతో వారు తమ కృతజ్ఞత ధన్యవాదాలు తెలిపారు. నేడు చేసిన మంచికి మండలకేంద్రములో అడ్వకేట్ పడాల శ్రీనివాస్, లయన్ అంబటి చెన్న కిష్టయ్య, స్థానికులతో కలిసి సుధాకర్ నాయక్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు. వీరిలో మండల రిపోర్టర్‌లు, కొండల్, పులిగిళ్ళ స్వామి, స్థానికులు పెండెం గణేష్, పలుగుల శ్రీనివాస్, ఇమ్మడి శివ, శ్రీశైలం, సాయి, నర్సింహ నాయక్ పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/చండూరు:** ఇటీవల కాలంలో దోనిపాములు గ్రామానికి చెందిన పడసనబోయిన యాదయ్య తండ్రి పడసనబోయిన మాసయ్య గెండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న టిఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొబ్బల వెంకట్రామ్ రెడ్డి ( టామన్న) ఫౌండేషన్ సభ్యుడైన ఆస్కాని శ్రీను ద్వార మృతుడి కుటుంబానికి 10వేల రూపాయల ఆర్థిక సహాయంను అందింపజేశారు.



## పశువైద్య శిబిరం

**ప్రజాపక్షం/నకిరేకల్** : పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని చందంపల్లి గ్రామం లో గోపాలమిత్ర పశు వైద్య చికిత్స శిబిరాన్ని నిర్వహించారు.ఈశిబిరంలో గేదెలకు ఉన్న వ్యాధులను గుర్తించి తగిన వైద్యాన్ని అందజేశారు. దూడలకు నట్టల నివారణ మందును తాగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాచర్ల చంద్రకళ యాదగిరి,ఉప సర్పంచ్ మెడ సైదులు, డిఎల్‌డిఏ ఈవో డాక్టర్ రాజశేఖర్, మండల పశు వైద్యాధికారి జొన్నలగడ్డ రామిరెడ్డిపాల్గొన్నారు.





## సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి

### ఎమ్మెల్యే వేముల వీరేశం

**ప్రజాపక్షం/నకిరేకల్** : సంస్కృతి,సాంప్రదాయాలను కాపాడాలని స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు.సోమవారం నకిరేకల్ పట్టణ యాదవ్ సంఘం ఆధ్వర్యంలో గంగాదేవమ్మ తల్లి గావు కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలందరికీ సుఖసంతోషాలు,ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్ గౌడ్,ఓగోడు సర్పంచ్ పల్లెబోయిన లెనిన్ బాబు,కౌన్సిలర్లు రాచకొండ సునీల్,గాజుల సుకన్య పాల్గొన్నారు.

## ప్రభబండ్ల ఊరేగింపు

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్** : మండలంలోని చీదెళ్ల గ్రామంలో శ్రీలక్ష్మి తిరుపతమ్మ గోపయ్య స్వాముల జాతరలో భాగంగా సోమవారం ఆలయ కమిటి చైర్మన్ రణబోతు శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ కీర్తి యలమంచయ్య గౌడ్‌ల ఆధ్వర్యంలో ఘనంగా ప్రభబండ్ల ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపులో భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చి తిలకించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటి చైర్మన్ రణబోతు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జాతర సందర్భంగా మంగళవారం రాష్ట్రస్థాయి కోలాట పోటీలు, సాయంత్రం డ్యాన్స్ బేబీ డ్యాన్స్, మిడిశానమెట్ల శివరాం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## ఇంటింటికి ప్రచారం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : పోచంపల్లి మున్సిపల్ పట్టణ కేంద్రంలోని నాలుగో వార్డ్ సిపిఎం పార్టీ అభ్యర్థిగా సమస్యల పట్ల పోరాడే వడ్డేపల్లి యాదగిరిని గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ అన్నారు. సోమవారం పోచంపల్లి పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు మంచాల మధు, పట్టణ కమిటీ సభ్యులు బుగ్గల లక్ష్మయ్య, నాయకులు నల్ల బాలయ్య పాల్గొన్నారు.

## వేణుగోపాల స్వామి రథోత్సవం

**ప్రజాపక్షం/నాంపల్లి:** పట్టణ కేంద్రంలోని శ్రీరాధా రుక్మిణి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం బంతిపూలతో ముస్తాబు చేసిన రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి రథాన్ని తాడుతో లాగారు. అంతకు ముందు పూజారుల వేద మంత్రోచ్చారణలతో యజ్ఞ కార్యక్రమాలు చేపట్టారు.భక్తులు కట్న కానుకలు సమర్పించి,మొక్కులు చెల్లించుకున్నారు.స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. ఎస్ఐ లింగారెడ్డి సమక్షంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

## బిఆర్ఎస్‌తోనే సుస్థిర పాలన

**ప్రజాపక్షం/హాలియా:** భారతీయ రాష్ట్ర సమితి వ్యవస్థాపకుడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తోనే రాష్ట్రంలో సుస్థిరత పాలన సాధ్యమని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ అన్నారు. సోమవారం హాలియా మున్సిపాలిటీలోని నాలుగో వార్డ్ జంగాల కాలనీ వాసులు మాజీ ఎమ్మెల్యే భగత్ సమక్షంలో బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకొని ఈ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపుకు పనిచేస్తామని పార్టీ కండువా కప్పించుకున్నారు. జంగాల కాలనీలో ఉన్న కడమంచి శ్రీను ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, హాలియా పట్టణ అధ్యక్షుడు వడ్డే సతీష్ రెడ్డి, సురభి రాంబాబు, వెంకటేశ్వర్లు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

